




## నెల నెలకి కొన్ని కొన్ని కులాసా కబుర్లు

# చందమామ కబుర్లు



అవి ఇంటర్నెట్ లేని రోజులు. చేతిలో ఉన్న సెల్‌లో నుండి బటన్ నొక్కగానే మెసేజ్ వెళ్ళని రోజులు. అదెందుకు టెలిఫోన్ అనేది ఆఫీసుల్లోనూ, అతిముఖ్యమైన అధికారులకే తప్ప లేని రోజులు. గట్టిగా మాట్లాడితే టీ.వీలు అస్సలు ఊహకే రాని రోజులు... ఇంకా మన పిల్లలు విస్తుపోవడానికి... కరెంట్ కూడా అందరికీ అందుబాటు కాని రోజులు!

మా చిన్నతనంలో సీతయ్య తోట అనే పెద్ద కాంపౌండ్‌లో చాలా కుటుంబాలు అద్దెకి ఉండేవి. మా అమ్మమ్మ కూడా మా మనవలందరినీ పెట్టుకుని ఒక గదిలో ఉండేది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి పది అడుగులేస్తే చేరేవాళ్ళం. సాయంత్రాలు మా పెద్దమ్మ కూతుళ్ళు ప్రబంధ నాయకల్లా అక్కడున్న ఎత్తు అరుగుల మీద కూర్చుని రోడ్డు మీద వచ్చేపోయే జనాన్ని చూస్తూ లాంతర్లు ముగ్గుపెట్టి మెరిసేటట్లు తుడిచేవారు! అప్పటికింకా నేను చాలా చిన్న పిల్లని. అయినా నాకాదృశ్యం గుర్తే! అమ్మవారి జాతర వస్తే కాంపౌండ్‌ని ఆనుకున్న పేవ్‌మెంట్ నిండా అంగళ్ళు పెట్టి బొమ్మలు అమ్మేవారు. అప్పుడు చేతికి పెట్టించుకున్న జీళ్ళ గడియారం... రంగురంగుల గాజులతో చేసిన కెలిడియోస్కోపూ... రంగు కళ్ళద్దాలూ..... సుద్దతో చేసిన బొమ్మలూ, అవి కొనుక్కుంటుంటే డప్పులతో మా మీదకి తాళ్ళతో పరుగెత్తుకొచ్చే పోతరాజులూ... ఎన్నటికీ మరచిపోలేం! ఆ దెబ్బపడితే అదృష్టం అనేవారు. కానీ మాకు ఒళ్ళంతా వేపాకులు కట్టుకుని, కల్లు తాగి, జుట్టూ విరబోసుకుని రెండు చేతులతో వాళ్ళు పట్టుకుని ఎర్రటి కళ్ళతో ఊగే ఆ పోతరాజులు కలలో కొచ్చి జ్వరం తెప్పించేవారు.

ఇంతకీ ఇంత పాతబడ్డ రోజుల గురించి ఎందుకు చెప్తున్నానంటే, ఆ రోజుల్లో ఒక విషయంలో చాలా ముందుండే వాళ్ళం. అది పఠనాసక్తి. పిల్లలూ, పెద్దవాళ్ళూ, ఆడవాళ్ళూ వార్తాపత్రికలూ, వారపత్రికలూ, పిల్లల బొమ్మల పుస్తకాలూ తప్పకుండా చదివేవాళ్ళు. వీధికో గ్రంథాలయం కాకపోయినా వెతుక్కుంటే ఉండేవి. అద్దె పుస్తకాల షాపుల మీద ఆదాయం కూడా బానే ఉండేది.

ప్రతి ఇంట్లో అందరినీ అలరించే అందమైన అలంకరణ ఒకటుండేది... అదే చందమామ! "చందమామ కథలో చదివా.... రెక్కల గుఱ్ఱం ఉంటుందనీ.... నమ్మడానికి ఎంతో బాగుందీ..." అనే పాట విన్నారా?... చందమామ కథల్లో మాయదారి ముసల్దీ, మంత్రాల దీవీ, రాక్షసలోయా ... భేతాళ కథలూ, బొమ్మల రామాయణం, వీరహనుమాన్, శివలీలలూ, నీతి కథలూ, పిట్ట కథలూ, పేదరాశి పెద్దమ్మ

కథలూ, ఆకాశరామన్న కథలూ, మర్యాదరామన్న కథలూ, పరోపకారి పాపన్న కథలూ... ఇలా ఎన్నెన్నో... చిన్నప్పుడు నమిలినచెరుకు గెడ తీపిలా.... వదలలేని జ్ఞాపకాలు!

చిన్నప్పుడు నాకొక స్నేహితురాలుండేది. పేరుకే స్నేహితురాలు కానీ అను నిత్యం పోట్లాడుకునేవాళ్ళం. అది టీచర్‌కి నామీద కంప్లైంట్ ఇవ్వని రోజుండేది కాదు. నేను ఏడవని రోజు ఉండేది కాదు. ఇంటర్వెల్‌లో వాళ్ళ చెట్టు రాచ ఉసిరికాయలూ, మావిడి పిందెలూ కంపాస్ బాక్స్‌లో తెచ్చి అందరికీ పంచి నాకు ఇచ్చేది కాదు! అఫ్‌కోర్స్... నేనూ దానికి మరమరాలూ, జామకాయ ముక్కలూ ఇచ్చేదాన్నికాదు. దానికి తెలీకుండా బ్లేడ్‌తో దాని స్కర్ట్ కత్తిరించేదాన్ని కూడా! ఇలాంటి శతృత్వంలో కూడా వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడూ బడికి దానితో కూడా వెళ్ళేదాన్ని. కారణం దాని స్నేహంపోకూడదని. ఎందుకంటే వాళ్ళింట్లో చందమామ తెప్పిస్తారు. అది అక్కడే కూర్చుని చదివి ఇచ్చేసేదాన్ని. చదివాక రాత్రంతా కలలు... రెక్కల గుర్రం ఎక్కినట్లూ... నిధులున్న గుహలో తిరుగుతున్నట్లూ, పక్షుల రాణితో యక్షకన్యలతో జతకలిపి ఆడుతున్నట్లూ......... ఓహ్! కలలు కనడానికి కూడా ఆ ప్రపంచం తెలియాలిగా! ఎంత అందమైన ప్రపంచం అది! అన్ని వయసుల వాళ్ళకీ నచ్చే ప్రపంచం. పిసినారితనం గురించి, బద్ధకం గురించి, నీతీ, నిజాయితీ గురించి, పేరాశ గురించి విడమరచి చక్కని కొసమెరుపులతో, మెదడుకి మేత పెట్టే భేతాళ ప్రశ్నలతో అందమైన వర్ణచిత్రాలతో అదో అందమైన పూలతోట. ప్రతిపుష్పం వింత సౌరభాలని గుబాళించేవి.

సి.నాగభూషణరావుగారు అనే పెద్ద మనిషి నాకో కామన్ ఫ్రెండ్ ద్వారా పరిచయం అయ్యారు. ఆ ఫ్రెండ్ మాటల మధ్యలో ఆయన దగ్గర 1965 మార్చి ప్రారంభసంచిక నుండీ చందమామలున్నాయి అని చెప్పారు. నా చిన్నతనం నాకు జ్ఞాపకం వచ్చింది. ఆయన్ని కలిసి స్నేహం చేసుకున్నాను. .... కేవలం చందమామల మీదున్న ఆపేక్షతో. తర్వాత ఆయన సాహిత్యంతో ఆయన జ్ఞానంతో చెలిమి చెయ్యడం జరిగిందనుకోండీ! ప్రపంచవ్యాప్తంగా చిన్న పిల్లల వెబ్ మేగ్‌జైన్ ఒకటి డిజైన్ చేస్తున్నారు ఆయన. ఆయన గది నిండా చందమామల నుండీ తీసిన వర్ణచిత్రాల పేజీలతో... కె.వి.ఆర్ భక్త తీసిన విజయచిత్ర హీరోయిన్ల ఫోటోలతో ఆలీబాబా వెళ్ళిన దొంగల గుహలా కళ్ళు మిరిమిట్లు గొలిపాయి. మా తరం వాళ్ళకి తెలిసిన, మాపిల్లలు మిస్ అవుతున్న అద్భుత ప్రపంచం.



‘అందమైన చందమామ..... అందరాని చందమామ.... అమ్మా నా చేతిలోని అద్దంలో చిక్కెనమ్మా” అనే చిన్నప్పుడు బాలానందంలో రేడియో అక్కయ్య పాడించిన పాట నెమరు వేసుకున్నాను.

చిన్నప్పుడు నా స్నేహితురాలితో ‘చందమామ స్నేహం‘ చేసినట్లే సి.నాగభూషణరావుగారితో స్నేహం చేసుకున్నాను. ఆయన ప్రారంభసంచిక నుండీ ఉన్న చందమామలన్నీ సీ.డీ.లు చేయించి నా లైబ్రేరీకి ఇస్తానన్నారు.

చందమామ విలువ తెలిసినవాళ్ళకే ఆ అనుభూతి తెలుస్తుంది! చందమామలు చదివి ఆనందించని జీవితం ఎందుకూ? ఆ కథల్లో తీపినీ ఆ చిత్రకారుల కుంచెల్లో సోయగాన్నీ అర్థం చేసుకోలేని జన్మలెందుకూ?

పాలసంద్రాన్ని చిలికితే వచ్చిన కల్పవృక్షం కామధేనువూ కన్నా మన చందమామ మిన్న! చందమామలో కుందేలు మిమ్మల్ని పిలవడం లేదా? దాన్ని మీ తరువాతి తరానికీ పరిచయం చెయ్యండి రండి! ***